క్లుప్తంగా

కొనసాగుతున్న సంప్రదాయం



యాదవరాజుతో ముస్లింలు

మద్దికెర: మండల కేంద్రంలోని చిన్న మసీదు ముస్లింలు ప్రతి పండుగకు స్థానిక యాదవరాజులను కలిసి శుభాకాంక్షలు తెలియజేసే సంప్రదాయం కొనసాగుతోంది. అందులో భాగంగా సోమవారం ముస్లింలు బక్రీదు పండుగను పురస్కరించుకుని యాదవరాజుల ఇంటికెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవరాజులు జమేదార్ జయరామరాజు ముస్లింలను కూడా సాదరంగా ఆహ్వానించారు. తాంబూలం అందజేసి సాగనంపారు.

వెండి వస్తువుల విరాళం



వెండి దీపాలు, పాదాలు అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఇమాంసాహెబ్ దర్గాలో స్వామి వారికి స్థానిక ఆర్కే మిత్ర బృందం రూ.లక్ష విలువ చేసే వెండి పాదాలు, దీపాలు విరాళమిచ్చారు. వెండి వస్తువులను సోమవారం దర్గా నిర్వాహకుడు బాషాకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రఫీ, మైనారిటీ సంఘం నాయకులు ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



చాకలి నాగేష్ (ఫైల్)

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చాకలి నాగేష్ (46) అనారోగ్యంతో కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి వైద్యశాలకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం మద్దికెరలో జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, నాయకులు శ్రీనివాసులు, కృష్ణ, అంజనేయులు, తదితరులు నాగేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు పీఎం కిసాన్ నగదు విడుదల

హాలహర్వి: పీఎం కిసాన్ డబ్బు మంగళవారం విడుదల కానున్నట్లు వ్యవసాయాధికారి శివశంకర్ సోమవారం తెలిపారు. ఒక్కో రైతుకు రూ.2 వేల చొప్పున మండలంలో మొత్తం 10,620 మంది రైతులకు డబ్బు జమ కానుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసు స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్ల ట్రాలీలు

హొళగుంద: మార్లమడికి వద్ద వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుతున్నట్లు సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది అక్కడికెళ్లగా డ్రైవర్లు ట్రాలీలను వదిలి ఇంజిన్‌లతో పరారయ్యారు. పోలీసులు వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పొలం వివాదంలో ఘర్షణ

● పలువురికి గాయాలు

తుగ్గలి: మండల పరిధిలోని బొల్లవానిపల్లిలో పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఓ వర్గానికి చెందిన జానకిరామిరెడ్డి, గోవిందరెడ్డి, మరో వర్గానికి చెందిన సోమశేఖరరెడ్డి, రంగారెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూ వివాదం నెలకొంది. సోమవారం ఈ విషయమై మాటామాటా పెరిగి ఘర్షణ పడగా నలుగురూ గాయపడ్డారు. వీరిలో గోవిందరెడ్డి తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులును సంప్రదించగా బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామన్నారు.

సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకొని సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామలో సోమవారం సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం చేశారు. ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ మానవ జీవిత పరమార్థం తెలుసుకోవాలంటే భగవద్గీత చదివి తీరాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు సింహాద్రి రమేష్, రమణ, మహాబలేష్, జగదీష్, అనిల్, నారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పరి మండలంలో..



ఆస్పరిలోని ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న మత గురువు ఇస్మాయిల్

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, హలిగేరి, నగరూరు, తంగరడోణ, జొహరాపురం, బిల్లేకల్, కై రుప్పల, ములుగుందం, కారుమంచి, డి.కోటకొండ, బనవనూరు తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల ఈద్గాల వద్ద మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆస్పరిలో ముస్లింలు మసీదు నుంచి ప్రార్థనలు చేసుకుంటూ ఊరేగింపుగా ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈద్గా వద్ద మత గురువు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుంటూ ఒకరికొక్కరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా గ్రామాల్లో పేదలకు ముస్లింలు తనకు తోచినంత సాయం చేశారు.

హొళగుంద మండలంలో..



హొళగుందలో ఊరేగింపుగా ఈద్గాకు బయలుదేరిన ముస్లింలు

హొళగుంద: మండలంలో సోమవారం బక్రీద్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖురాన్ సారాంశాన్ని మౌలిసాబ్‌లు వివరించారు. అనంతరం ఊరేగింపుగా ఈద్గాలకు వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సుళువాయి, గజ్జహళ్లి, ఎల్లార్తి, హెబ్బటం తదితర గ్రామాల్లోనూ ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా చేసుకున్నారు. కాగా గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా హొళగుందలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఆలూరులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆలూరు రూరల్: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలూరులోని కర్నూలు–బళ్లారి రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామియా మసీద్ గురువు ఖమర్ అలీ ఖాద్రీ ముస్లింలకు దైవ సందేశాన్ని అందించారు. ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒక్కటైన హజ్ తీర్థ యాత్రను ఈ నెల నుంచే ప్రారంభించి పూర్తి చేస్తారన్నారు. ప్రతి ముస్లింకు అల్లా హజ్ యాత్ర కల్పించాలని దువా చేశారు. మండలంలోని మొలగవల్లి, హత్తిబెళగల్, అరికెర, కురుకుంద, పెద్దహోతూరు, కురువళ్లి, తదితర గ్రామాల్లోనూ ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలూరులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముతవల్లీ రజాక్ సాబ్, మౌజన్ గులాం సర్వర్, మత పెద్దలు పీరా సాబ్, జాఫర్ సాబ్, రసూల్ సాబ్, బాబు సాబ్, షేక్ అహ్మద్, ఉస్మాన్ సాబ్, షేక్షావలి, గోలీఘర్ జిలాన్, షేక్ అహ్మద్, రఫీక్, మదర్, షేక్షావలి, దస్తగిరి పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలో..

చిప్పగిరి: మండలంలో బక్రీద్‌ను సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక భంభం స్వామి దర్గాలో స్వామి వారి వంశీయులు డాక్టర్ ఆరిఫ్ ఉదీన్ ఖాద్రి, సయ్యద్ హర్షద్ ఖాద్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలద్దేశించి ఉపదేశం ఇచ్చారు. త్యాగాలకు ప్రతీకగా బక్రీద్‌ను ప్రతి ముస్లిం జరుపుకుంటారన్నారు. నిరుపేదలకు సహాయం చేయడం ఈ పండగ ముఖ్య ఉద్దేశమన్నారు. ముల్లా పెద్ద సత్తార్, కోఆప్షన్ మెంబర్ సర్వర్ కాన్, అబ్దుల్ మునాఫ్, సుల్తాన్, శేక్షావలి, లాలెప్ప, వన్నూరు సాహెబ్ పాల్గొన్నారు.

హాలహర్వి మండలంలో..

హాలహర్వి: మండలంలోని చింతకుంట, గూళ్యం, కామినహాల్, హాలహర్వి తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లీం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బక్రీద పండగ విశిష్టతను ముస్లీం సోదరులు తెలియజేశారు.

పత్తికొండ మండలంలో..



పత్తికొండలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న మత గురువు

పత్తికొండ రూరల్: త్యాగానిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌ను సోమవారం పత్తికొండ మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో అల్లాను స్మరించుకున్నారు. ఈసందర్భంగా మతపెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేస్తూ ఖుర్బానీ ప్రాధాన్యతను వివరించారు.



ఈద్గా వద్ద ప్రార్థనకు హాజరైన ముస్లింలు

తుగ్గలి మండలంలో..

తుగ్గలి: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తుగ్గలి, ఆర్ కొట్టాల, గిరిగెట్ల, జొన్నగిరి, ఉసేనాపురం, రాతన, చెన్నంపల్లి, జి.ఎర్రగుడి తదితర గ్రామాల్లోని ఈద్గాలలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. ముస్లింలు తమ బంధువులకు స్తోమతను బట్టి దానాలు చేశారు.

మద్దికెర మండలంలో

మద్దికెర: మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో ముస్లింలు సోమవారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మద్దికెరలో ముస్లింలు ర్యాలీగా పెద్ద మసీదుకు చేరుకున్నారు. శివారు ప్రాంతంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కృష్ణగిరి: త్యాగానికి ప్రతీక ఈద్–ఉల్–జుహా (బక్రీద్) పర్వదినాన్ని కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ఈద్గా మైదానాల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. బక్రీద్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. పేదలకు దానధర్మాలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



చిప్పగిరి భంభం స్వామి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు



హాలహర్విలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఆర్ కొట్టాల ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

వాల్మీకుల ప్రతిష్ట పెంచుతా



ఎమ్మెల్యే విరూపాక్షితో నాయకులు

ఆలూరు: వాల్మీకుల ప్రతిష్ట పెంచుతానని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. ఎమ్మిగనూరు వాల్మీకి వన భోజన సమితి నాయకులు బంగారు వెంకటేష్, రాఘవన్, కృష్ణమూర్తి మల్లయ్య, లక్ష్మన్న తదిరులు సోమవారం చిప్పగిరి గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లేకపోయినా జగనన్నతోనే ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికార పక్షం నాయకుల దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను అండగా ఉంటానన్నారు. అంతకు ముందు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం సెలవు రోజు కావడంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

బంగారు వర్ణంలో భానుడు



సూర్యాస్తమయ సమయంలో ఆకాశంలో అద్భుతాలకు కొదువే ఉండదు. వర్షాకాలంలో ఇలాంటి దృశ్యాలు మరింత అధికం. సోమవారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ఆకాశం బంగారు వర్ణంలో కాంతులు వెదజల్లడంతో పట్టణ పరిసరాలు ఒక్కసారిగా పుత్తడి వర్ణంలో మెరిసిపోయాయి. ముఖ్యంగా రైల్వే స్టేషన్ పరిసరాలు కొత్తందాలను సంతరించుకున్నాయి. కర్నూలు, నంద్యాల రైల్వే గేట్ల మధ్య సూరీడు అందాలు మంత్ర ముగ్ధులను చేశాయి. సూర్యుడు మెల్లగా జారుకుంటుండగా ఆకాశం పసిడి కాంతులతో వెలుగులీనిన దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. – డోన్ టౌన్

స్నేహితురాలికి సాయం



స్నేహితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

పత్తికొండ రూరల్: ఆపదలో ఉన్న స్నేహితురాలికి తోటి మిత్రులు సాయం అందించారు. 1997లో పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థిని సావిత్రి భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు పిల్లల కుటుంబ పోషణతో తమ స్నేహితురాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న మిత్రులు ఫోన్ పే ద్వారా రూ.25 వేలు పోగు చేసి ఆర్థిక సాయాన్ని తమ మిత్రుల ద్వారా సోమవారం బాధితురాలికి అందించారు.

పేద బాలికలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అనాధలు, అంగవైకల్యం కలిగిన పేద బాలికలకు నగరంలోని జేపీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆరోగ్య కార్యకర్తల శిక్షణా కోర్సులో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ ఈ.పద్మాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్ పాస్‌తో సమానమన్నారు. ఈ కోర్సు పాసయిన వారు మహిళా ఆరోగ్య కార్యకర్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులన్నారు. కళాశాలలో హాస్టల్ వసతి ఉందని, ప్రాక్టికల్స్ స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేయిస్తామన్నారు. వివరాలకు 9848352725, 9949472206 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ



మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నాగరాజు

తుగ్గలి: పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబాలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరామర్శించారు. సోమవారం రామలింగాయపల్లికి చేరుకుని కామేశ్వరి, సుంకన్న మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలను ఓదార్చారు. ఇద్దరి మృతితో పాటు పలు గొర్రెలు కూడా కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10వేల చొప్పున సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానన్నారు. ఎంపీ వెంట జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు ఉన్నారు. అలాగే సీపీఐ నాయకులు నబీరసూల్, సుల్తాన్, వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో లోపాలు రానివ్వద్దు

● ఆలూరు విద్యుత్ ఏఈ గుర్రప్ప



మాట్లాడుతున్న ఏఈ గుర్రప్ప

ఆలూరు: విద్యుత్ సరఫరాలో లోపాలు రానివ్వద్దని ఏఈ గుర్రప్ప సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వివిధ గ్రామాల జూనియర్ లైన్‌మెన్లు, లైన్‌మెన్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏఈ గుర్రప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని 22 మంది జూనియర్ లైన్‌మన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు పోల్ టూ పోల్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతోపాటు వృత్తి ధర్మాన్ని పాటించి విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో లైన్‌ఇన్‌స్పెక్టర్లు దేవేంద్ర, పంపయ్య స్వామి, నరసప్ప, బాషా, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. మహానందీశ్వరుని పల్లకోత్సవం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారి పల్లకీని మోస్తూ భక్తిని చాటుకున్నారు.